# మొక్కుబడి

ఆ చుట్టుప్రక్కల ఇరవై, ముప్ఫయిమైళ్ల దూరంలో గల అన్ని గ్రామాలకూ అంకమ్మతిరునాళ్ల ఒక్కటే గొప్పతిరునాళ్ల. ప్రతిసంవత్సరమూ జ్యేష్ఠశుద్ధ పంచమి లగాయతు మూడురోజులు అంకమ్మజాతర బహు వేడుకగా జరుగుతుంది. ఆ తల్లి ప్రత్యక్షదేవత అని ప్రతీతి. ఆ అమ్మవారి తిరునాళ్ల వైభవం కళ్లతో చూడవలసిందే కాని వర్ణించడానికి శక్యంకానిపని. అమ్మవారిదేవళం గ్రామానికి తూర్పుగా ఒక ముప్పాతికమైలు దూరంలో ఉన్నది. అది ఒక చిన్నదేవళం. అమ్మవారి కాదేవళం అత్తవారిల్లు. ప్రతీయేటా జాతర మూడురోజు లుందనంగా అమ్మణ్ణిని అత్తవారింటనుండి గ్రామంలోనికి (పుట్టింటికి) తీసుకొనివచ్చి గ్రామంలో నాలుగు వీథులూ కలిసేచోట ఒక చిన్నతాటాకుల గుడిసె వేసి దానిలో ప్రవేశపెట్టే మామూలు. అమ్మణ్ణికి లాంఛనాలూ, మర్యాదలూ జరపడానికై ఆ గ్రామకరణంగారిల్లు అమ్మకు పుట్టిల్లూ. మునసబుగారిల్లు అత్తవారిల్లూగా అనాదినుండి ఏర్పాటు అయిఉన్నవి. అందువల్ల గ్రామంలో వేయబడిన గుడిసెలో వేంచేపు చేసేముందు అమ్మవారిని ముందుగా కరణంగారింటికి తీసుకొనివచ్చి కొత్తచీరలు కట్టబెట్టి పసుపూ కుంకుమా పెట్టి, ఒడిబియ్యం మూటగట్టి, వడపప్పూ పానకం చలిమిడిముద్దలూ పంజారం చేసి, పొయ్యేముందు రెండు బిందెల నీళ్ల వారుపోసి అమ్మను పుట్టింటి గుడిసెలో ప్రవేశపెట్టే ఆచారం. జాతరనాడు అమ్మవారు పయనమైపొయ్యేముందు, గ్రామమునసబుగారింటికిపోయి, వారివల్ల కూడా తగు సత్కారాలు పొంది జాతరకు బయలుదేరి ఊరుకు తూర్పుగా ఉన్నదేవళంలో చేరుకుంది. అది లగాయతు మూడురోజులు జాతరవైభవం అంతా దేవళం దగ్గరనే జరుగుతుంది. మూడురోజులూ జాతర అయిన తరువాత అమ్మవారి గరగలను దేవళంలోనుండి లేవదీసి వంతు చాకలివాడి ఇంట్లో అటకమీద భద్రపరుస్తూ ఉంటాడు. ప్రతిగరగకూ లావూ, పొడుగూ, ఎత్తూ వగైరా కొలతలు తీసుకొని, కాగితంమీద వ్రాసి, గరగలెన్నో లెక్కపెట్టుకొని కరణంగారు వంతుచాకలివాడి దగ్గర రసీదుతీసి దగ్గర పెట్టుకొంటాడు.

ఆ సంవత్సరం పంచమినాడు జాతర అనంగా, పాడ్యమినాడే వంతుచాకళ్ళు గరగలను అటకమీదినుండి దించి, అరవీసెడు చింతపండు పట్టించి, ఊరుబయటవొరువుకాడ ఇసకాబూడిదా పట్టించి ఒక్కపూట అంతా చేతులు మంటపుట్టేటట్టు — నల్లగా చెక్కపేడులాగ ఉండిన ఇత్తడి గరగలు తెల్లగా బంగారు చాయ వచ్చేటట్టుగా—శుద్ధి శుభ్రం చేశారు. సంవత్సరం నుండి పాడుపడి, గాడిదలూ, పందులూ, కుక్కలూ పొర్లాడే దేవళాన్ని అర్చకులుగా ఉండే పూజగొల్లలు చిమ్మి బాగుచేసి లోతట్టూ వెలితట్టూ కూడా సున్నం కొట్టి, వాకిటిముం దొక తాటాకు పందిరి వేసి, వేపమండల తోరణాలు కట్టి అలంకరించారు. మామూలు ప్రకారం అమ్మవారిని విదియనాడు ఉదయాన్నే దేవళం దగ్గర నుండి లేవదీసి పోతురాజుతోసహా గ్రామంలోకి తీసుకొనివచ్చి మామూలు మర్యాదలు జరిగిన తర్వాత వీధిలో వేసిన గుడిసెలో ప్రవేశపెట్టారు

పంచమినాడు జాతర ఆరంభం. ఆ వుదయాన్నే అర్చకులు గుడిసె వాకిట చిమ్మి, అలికి ముగ్గులుపెట్టి, పోతురాజు కొయ్యకు కొత్త పసుపూ, కుంకుమా పూసి వేపమండలు కట్టి అలంకరించి బయట గుడిసెకు ఆనించి యుంచారు. గుడిసెవాకిలి తెరచి ఉన్నది. అమ్మవారి గరగలు పసుపు కుంకుమాలంకారాలతో విరాజిల్లుతున్నవి. మట్టికుండిలోని అగ్ని హోత్రంలో పేల్చిన సాంబ్రాణిపొగ చుట్టుప్రక్కల వందగజాల వరకు వ్యాపించి ఆ వాతావరణాన్నంతా పవిత్రం చేస్తున్నది. రెండు సన్నాయి మేళాలూ, రెండుడోళ్ళూ, రెండు వీరణాలూ, రెండు తాషాలూ, ఒక రండోలూ, ఆరు డప్పులూ గల మేళం గుడిసెముందు మోగుతూ మిన్నుముట్టే ధ్వని చేస్తున్నది. అప్పుడప్పుడు కొందరు పూజగొల్లలు వలయాకారం గల బూరగొమ్ములు ఊదుతూ అంత ధ్వనిగల మేళవాయిద్యంలోనూ ఒక వింత ధ్వని కల్పిస్తున్నారు. అప్పటికప్పుడే అమ్మవారి గుడిసెకాడ జనం గుంపులుకూడి ఉన్నారు. మేళం ఆరంభం కాగానే చాకలివాడొకడు ఒక కోడిని తెచ్చి అమ్మవారి వాకిట తెగ్గోసి గరగలచుట్టూ తిప్పి పారవేశాడు బయట నిలబడియున్న మరొకచాకలి వాడు దాన్ని తీసుకొని భద్రపరుచుకొన్నాడు.

(అమ్మగారి సమక్షంలో—అనగా ఆమె దృష్టికి ఎదురుగ్గా—ఒక ఏభయి గజాల దూరంలో వీథికి నట్టనడుమను ఒక చిన్నగొయ్యి తీసి, ఆ గోతిలో ఒక చిన్న పందిపిల్లను (బ్రతికినదాన్ని) కాళ్లూ పొట్టా భూమిలోకి దింపి పీకెవరకూ మట్టితో పూడ్చి, మూతీ, కళ్లూ, తలా మాత్రం పైన ఉండేటట్టు మట్టికూరి గట్టిచేశారు. దూరాన్నుండి చూస్తే ఆ పందిపిల్ల తలకాయ సుమారు అయిదారంగుళాల ఎత్తున ఒక కొయ్యను భూమిలో నాటినట్టుగా కనపడుతుంది. ఆ పందిపిల్ల పీకెవరకు భూమిలో ఉండి, ఎటూకదలడానికి వీల్లేకుండా, ఊపిరి తిరగని స్థితిలో ఉండినప్పటికి ఇంకా బ్రతికి బయటపడి జీవించాలన్న అడియాసతో కాబోలు, ఎప్పుడూ కీచుకీచుమని అరుస్తున్నది. అంతట గ్రామంలోని రైతులందరూ వారివారి పశువులనూ, ఎద్దులనూ, ఆవులనూ, ఆవుదూడలను, బర్రెలనూ, బర్రెదూడలను ఒక్కొక్కరే మందలుమందలుగా పడమటినుండి తోలుకొని వచ్చి, పందిపిల్ల తలను పశువులచేత తొక్కించి తూర్పుగా తోలుకొని పోతున్నారు. పశువుల డెక్కలు తన మూతిమీద పడినపుడల్లా, ఆ పందిపిల్ల కీచుకీచుమని రోదనచేస్తూనే ఉన్నది. దీని ఏడుపు విని కొన్ని కొన్ని పశువులు బెదరుకొని, చెవులు నిక్కబెట్టి, గ్రుడ్లు పెద్దవిచేసి బిత్తరుచూపులు చూస్తూ, తోకలెత్తి భూమి నొకమారు మూచూచి, తటాలున నాలుగుకాళ్లూ ఎత్తిఎగిరి ఒక్కగంతువేసి ముందుకు పారిపోతున్నవి. ఇంతా కష్టపడి తోలుకొని వచ్చిన పసరాలు పందిపిల్లను తొక్కకుండా పోతే ప్రయోజనంలేదని, అట్టి పశువుల ఖామందులు వాటిని మెడపలుపులు పట్టుకొని, బెదరకుండా చోయ్, చోయ్ అని మెడమీదా, వంటిమీదా చేత్తో నిమురుతూ నెమ్మదిగా పందిపిల్ల దగ్గరకు తెచ్చి, నాలుగు కాళ్ళల్లో ఒక్కకాలితోనయినా పందిపిల్లను తొక్కించి మరీ తీసుకొనిపోతున్నారు. కొన్నిపశువులు పరధ్యానంగా పోతూ పోతూ, కాలికింద పందిపిల్ల పడి కీచుకీచుమనేవరకు హఠాత్తుగా బెదరి ఎటూపోవడానికీ తోచక అక్కడనే కటిక్కన నిలబడి నాలుగుకాళ్లతోనూ గబగబ గుర్రము కదంతొక్కినట్లు పందిపిల్లను తొక్కుతూ వికటనృత్యం చేస్తున్నవి. ఇంతలో వెనకనుండి కొన్నిపశువులు తోసుకొనివచ్చి ముందు పశువులను కొమ్ములతో కుమ్ముతూ

తరువాత వాటివంతు తీర్చుకొంటున్నవి. ఈ ప్రకారం జాముపొద్దెక్కేవరకు గ్రామంలోని పశువులు, చిన్నా పెద్దా సుమారు నాలుగైదు వందలు, డెక్కలతో పందిపిల్లపై విహారం సలిపేవరకు, పాపం, ఆ పందిపిల్లకు పొడుగాటి మూతిచివర మెత్తనిస్థలం కొట్టుకొనిపోయి, చర్మంలేచి, చితికి ముద్దయి, ఎర్రగా పుండుపడి నెత్తురు ప్రవహిస్తున్నది. ఇంకా పందిపిల్ల అరుస్తూనే ఉన్నది—దానిదెంత మొండిప్రాణమో! ఇంతలో ఒకకాపువాళ్ల పిల్లవాడు- పద్నాలుగేళ్లవాడు-తనఇంట పుట్టిన పడమటి ఆవు కోడెదూడను తాను స్వయంగా తోలుకొనివచ్చి, తన కోడె బెదరి సరిగా తొక్కుతుందా తొక్కదో అని, తానుకూడా ఉండి, పందిపిల్లదగ్గర కూర్చొని, దూడ ముందుకాలు చేత్తోపట్టుకొని, రక్తప్రవాహంతో ఎర్రడాలు పొందిన పందిపిల్లమూతి మాంసంకండమీద డెక్కతో పదిసార్లు తన తనివితీర తొక్కించి, చూచేవాళ్లు నవ్వుతూ కేరింతాలు కొట్టుతుండగా కోడెను ఇంటికి తోలుకొనిపోయినాడు. అప్పటికప్పుడే పది, పదకొండు గంటలైనది. గ్రామంలో ఇక రావలసిన పశువులు లేవంటే లేవని అనుకొన్నారు రాత్రిళ్ల పొలంలో కట్టివేసే పశువులుకూడా వచ్చిపోయినవని కొందరన్నారు. చాకలి వాడొకడు వచ్చి, పూడ్చి ఉంచిన పందిపిల్లను బయటికి తీశాడు. దానికింకా ప్రాణం పోలేదు. గోతిలో ఉండంగనే ప్రాణంపోతేనే తప్ప లేనియెడల గ్రామపసరానికి చీడ తగులుతుందంటారు మరి! అందువల్ల అట్టి పందిపిల్ల బ్రతికి మళ్లా గ్రామంలో తిరిగితే గ్రామానికంతకూ కీడు రాగలదన్న భయంతో, ఆ చాకలివాడు మూడుగజాలపొడుగూ, బొటనవ్రేలి లావూ గల ఒక ఇనపకడ్డీ తెచ్చి, సన్నంగా గూచివలె పదునుచేసిన దానిమొనను పంది పిల్లపొట్టలో గుండా అడుగునుండి వీపునడి భాగంలోకి వచ్చేటట్లు, కసుక్కున దాని లేతకడుపులో గుచ్చి, కడ్డీమొన వీపుపై ఒకబెత్తెడు ఎత్తుకు వచ్చిన తరువాత, పందిపిల్ల ప్రజలకందరికీ కనపడేలాగున, ధ్వజం ఎత్తినట్లు, కడ్డీ పైకిఎత్తి పట్టుకొన్నాడు. అప్పటికి పందిపిల్లకు బాధ నివారణమై ఏడుపు చాలించింది. దానికడుపులోని లేతనెత్తురు ఇనపకడ్డీమీదుగా చాకలివాడి చేతి మీదికి ప్రవహిస్తూ, నల్లని ఇనపకడ్డీని ఎర్రగా మార్చివేసింది. అటుపిమ్మట అమ్మవారిని గుడిసెనుండి లేవదీసి ఉత్సవంతో సహా గ్రామ మునసబుగారింటికి

తీసుకొనివెళ్ళి అక్కడ మర్యాదలు జరిగిన తరువాత మేళతాళములతో మధ్యాహ్నం ఒంటిగంటకు ఊరిబయట దేవళంలో ప్రవేశపెట్టించారు.

## 2

ఆ రోజే జాతర ఆరంభం. మూడురోజులు మహా వైభవంతో జరుగుతుంది. ఓ! జనం ఊరూరనుండీ విరగబడిపోతున్నారు. దేవళం, ఊరికి ఒక ముప్పాతికమైలు దూరంలో ఒక విశాలమైన ప్రదేశంలో ఉన్నది. ఆరోజు లగాయతు జరగవలసిన వైభవం అంతా దేవళం దగ్గరనే జరుగుతుంది. దేవళాని కెదురుగ్గా పెద్దమైదానం. మైదానంలో చింతచెట్లూ, వేపచెట్లూ, తాటిచెట్లూను. ఆ ప్రదేశం ఇరవై, ముప్పై ఎకరాల విస్తీర్ణం ఉంటుంది. అక్కడ ప్రతిసంవత్సరమూ గొప్పతిరునాళ్ల జరుగుతుంది కాబట్టి వేలకువేలు ప్రజలు దిగడానికీ, వేడుకలు చేసుకోడానికీ అనువుగా ఉండేటట్టు, ముప్ఫయిఏండ్ల క్రిందట జరిగిన రీసెటిల్మెంటులో సర్కారువారు ఆ ప్రదేశాన్నంతా ప్రత్యేకంగా ఒక సర్వేనెంబరుగా సర్వేచేయించి, దానిలో ఇతరులెవ్వరూ ప్రయివేటు ఉపయోగానికై ప్రవేశించకుండా, సెటిల్మెంటు రిజష్టరులో ఆ నెంబరును అంకమ్మదేవళం పోరంబోకుగా రిజష్టరుచేసి పుణ్యం కట్టుకొన్నారు. అది లగాయతు జాతరవేడుకలు జరుపుకోడానికి కావలసినంత విశాలమైన స్థలం, మండు వేసవిలో రోహిణీ కార్తిలో జరిగే జాతర కాబట్టి ప్రజలకు చల్లగా నీడ నివ్వడానికి ఎన్నోచెట్లు వేయించారు— దేవళం అర్చకులు. మంచినీళ్ళకు కొందరు పుణ్యాత్ములు చలివేంద్రలు పెట్టించి నీళ్ళు సప్లయి చేస్తుండే ఆచారం కలదు. ఆ మధ్య తాలూకా బోర్డువారు కూడా కనికరించి, ఒక ప్రత్యేకమీటింగులో వెయ్యిరూపాయలు శాంక్షన్ చేయించి, అక్కడ ఒక చేదుడు బావి త్రవ్వించి, గచ్చుతో బొడ్డు గోడా, పళ్లెమూ, గిలకా, బొక్కెనా వగైరాలన్నీ ఏర్పాటు చేయించారు. కాని-బావిని త్రవ్వించడానికి కంట్రాక్టు తీసుకొన్న తురక సాహెబ్ చేతిచలవ కాబోలు—ఇంత కర్చు పెట్టి తవ్వించిన బావిలో మంచినీళ్లు పడకుండా

నీళ్ళు జవ్వలుగా తేలినై. అయినప్పటికీ ఎండాకాలంలో ఆ చెవి గాడ్పు ఈ చెవికి కొట్టేరోజులు కాబట్టి, ఆవురావురుమని పీకె ఆర్చుకొనిపొయ్యే దాహానికి ప్రజలు ఆ నీటితోనే గొంతుకు తడుపుకొంటున్నారు.

తెల్లవారితే జాతర అనంగా మైదానం యావత్తూ చిల్లర అంగళ్ళతో నిండిపోయినది. మిఠాయి అంగళ్లూ, మామిడిపళ్ల, ఇత్తడిసామాను అంగళ్లూ కొయ్యసామాను అంగళ్లూ, పందిరి పట్టెమంచాల అంగళ్లూ, లక్కబొమ్మల అంగళ్లూ, పిల్లలాడుకొనే ఆటవస్తువుల అంగళ్ళూ--ఒకరకమేమిటి, రకరకాల అంగళ్ళతో నిండిపోయింది. ఒకతట్టు రంకులరాట్టం తిరుగుతోంది. ఇంకొక తట్టు గారడీ జరుగుతోంది. మరొక తట్టు యానాదివాళ్ళు పగటివేషాలు వేసి అడుక్కొంటున్నారు. ఇంకో తట్టు కాటమరాజుకథ, మరోమూల చిన్నపరెడ్డి పాట, వేరొకచోట ఆరెమరాటీలకథ, ఇంకోదిక్కున దేసింగ రాజుకథ వగైరాలు జరుగుతున్నవి. ఇంతమంది జనం చేరినపుడు ఏ కలరా అయినా అంటుకొంటే తుడిచిపారేస్తుందన్న భయంచేత, అట్టి జాడ్యాలు రాకుండా కాపాడేదేవత అయిన అంకమ్మతల్లి సమక్షంలోనే ఉన్నప్పటికీ—ఆ చల్లని తల్లిమీద విశ్వాసంలేని సర్కారువారు ఇద్దరు హెల్తు ఇన్‌స్పెక్టర్లనూ, నలుగురు వ్యాక్సినేటర్లనూ తిరునాళ్లడ్యూటీకై డెప్యూటు చేసి పంపారు. వారొక విశాలమైన పందిరి నిర్మించి, ప్రజలకు ఆరోగ్యవిషయకమైన విషయాలు బోధించే బొమ్మలపటాలను గోడలకు తగిలించి ప్రదర్శిస్తున్నారు. మరొకవంక తహశీల్‌దారుగారికీ, సబుమేజస్ట్రీటువారికీ, పోలీసు సర్కిల్ ఇనస్పెక్టరుగారికీ విడిదినిమిత్తం పాకలు వేయబడిఉన్నవి. జాతర మొదటి రోజు అంతగా వేడుక ఉండదు. రెండోరోజు సాయంత్రం ఆరుగంటలకు అమ్మవారికి గావు సమయం. అదే జాతర కంతకీ రసవత్తమమయిన ఘట్టం. అప్పటికిగాని జనం ముమ్మరంగా అందుకోరు.

తెల్లవారింది; రెండోరోజు ఉదయం ఏడు గంటల లగాయతు జనం చీమలబారులాగ రోడ్లవెంబడి బడి మూలమూలలనుండి వస్తున్నారు. ఇంటికాడ జరుగుబాటుగల ఆసాములు, వారి వారి తాహతుకు తగినట్లు కుంకంబండ్లు కట్టుకొని, వాటికి పైన రంగు రంగుల చీరలు కట్టి ఎద్దులకు మెడలో మువ్వలపట్టెడా, గంటలూ, మొఖాన్న చికుమోర, తలవెంట్రుకల

తాడూ, కొమ్ములకు పింగాణీపూసల చండా వగైరాలు కట్టి, శృంగారించి తోలుకొని వస్తున్నారు. ఇంకా జరుగుబాటు గలిగి కాస్త కలిగిన సంపన్న గృహాసులు ఒకటికి మూడూ, నాలుగూ కూడా కుంకంబండ్లు కట్టుకొని రావడమేకాకుండా, తలా ఒక ప్రభ కట్టించి, బండిమీద ఎక్కించి తీసుకొని వస్తున్నారు. ఆసాముల ఐశ్వర్యంలోగల ఔన్నత్యంకొద్దీ ప్రభలు కూడా ఉన్నతంగా మింటికి ఎగప్రాకుతున్నవి. ప్రభ ఎంత పెద్దదిగా ఉంటే, ఖామందుకు అంత గౌరవమూ, గొప్పతనమూను. ప్రభలకు రోడ్లమీది చెట్లు అడ్డుతగలకుండా రైతులు ముందుగానే లోకల్‌ఫండు డిపార్టుమెంటువారికి అర్జీలు యిచ్చుకోగా, వారు అడ్డుతగిలే చెట్ల కొమ్మలు నరికించి ప్రభల రాకపోకలకు ఇమ్ము చేసియుంచారు. అక్కడక్కడ టెలిగ్రాపు తీగెలు కూడా అడ్డు తగిలేవరకు, ఆడిపార్టుమెటువారికి అయిదేసి రూపాయలు అపరాధంకట్టి తీగలను క్రిందికి దింపుకొని ప్రభలను తోలుకొని తెచ్చుకొంటున్నారు ఆసాములు. ఎట్టి అటంకములున్నా, ఆ మూడు రోజులూ తిరునాళ్ళ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వాటినన్నిటినీ నివారించడానికి సర్కారువారు కనికరించి తయారుగా ఉన్నారు.

ఓ! వందలకొద్దీ ప్రభలు తిరునాళ్లకు చేరుతున్నవి. కొందరు రెడ్లు ప్రభలతోకూడా మేళమూ, తాళమూ, డప్పులూ వగైరా వైభవాలతో కూడా వస్తున్నారు. వారిలో ఇంకా గొప్పగొప్ప రెడ్లు పసుపు లంగీ, నెత్తికి ఎర్ర పాగా, మొలకు ఉత్తరీయం, చేత కైజారూ, మొఖాన్న కుంకంబొట్టూ ధరించి, పగటిదివ్వె, హనుమంతుచీర, పెడకొమ్ము, కలికితురాయి, ఉమ్మాయిపిట్ట, వేటకత్తి, కంచు కాగడా వగైరా లాంఛనాలతో సహా తిరునాళ్లకు వేం చేపు చేస్తున్నారు.

ఆ రోజు సాయంత్రం అయిదుగంట లయ్యేసరి ఎక్కడా ఇసకవేస్తే కిందికి రాలనట్టున్నారు జనం. పిల్లలు, పెద్దలు, ముసలివాళ్ళు, ఆడవాళ్ళు, మొగవాళ్ళు—రకరకాల మనుష్యులు రకరకాల శృంగార విజృంభణములతో తిరునాళ్లకు చేరుకొంటున్నారు. ఆ ప్రదేశ మంతా ఆనందం పొంగి

పొల్లెత్తుతూవుంది. వెంకురెడ్డి భార్యాకూడా కొడుకు బాలయ్యను తీసుకొని తిరునాళ్లకు వచ్చారు.

## 3

బాలయ్యకు జబ్బుచేసినపుడు మొక్కుకొన్న మొక్కుబడి వెంకురెడ్డికీ అతని భార్యకూ మరపునకు రాలేదు. ఎట్లా మరుస్తారు వాళ్ళు?— వాళ్లకు బాలయ్య ఒక్కడే కొడుకయ్యె. అదీగాక, బాలయ్య పుట్టినతరువాత ఈ పది సంవత్సరాలుగా తల్లికి మళ్ళా కాన్పు రానందున అతని మీదే పంచప్రాణాలూ పెట్టుకొని ఆ దంపతు లతన్ని కంటికి రెప్పలా కాపాడుకొంటున్నారు. అందులోనూ అతను లేకలేక కలిగిన సంతానం.

భార్య కాపురానికి వచ్చిన పది పదకొండేళ్లవరకూ వెంకురెడ్డికి సంతానం లేక భార్యాభర్త లిద్దరూ బిడ్డలకోసం ఆరాటించి, అనేక దేవుళ్లకూ, రాళ్లకూ, రప్పలకూ మొక్కుకోగా లేకలేక ఆ నలుసు—బాలయ్య పుట్టాడు. బాలింతరాలి పురిటిస్నానంరోజున వాళ్ల గ్రామం యావన్మందికీ పసుపూ, కుంకుమా, నూనె, నున్నిపిండీ, కుంకుడుకాయలూ పంచిపెట్టుకొన్నారు. గ్రామస్థులు కూడా వెంకురెడ్డిభార్య ఇంతకాలానికి మొగపిల్లవాణ్ని కన్నదికదా అని పదకొండోరోజు పురిటిస్నానంనాడు సంసార్లందరూ తలా ఒకబిందెడు వేణ్నీళ్ళూ భుజానపెట్టుకు మోసుకువచ్చి బాలింతరాలికి నెత్తిన దిమ్మరించి పోయారు. పదకొండోరోజునే బిడ్డకు బారసాల చేసుకొని, బాలయ్య అని తాతగారిపేరు పెట్టుకొని ఇరవైయొకటోరోజున పిల్లవాణ్నితొట్టిలోపెట్టుకొని, ఆరోజు సాయంత్రం నలుగురు పేరంటాండ్రనూ పిలుచుకొని, గ్రామానికి తూర్పుగమిడిలో వున్న మంచినీళ్ళ బావిలో బాలింతరాలిచేత చేద వేయించారు. ఈ ప్రకారం అవకాశాలు ఉన్నవి కొన్నీ, లేనివి కొన్నీ కల్పించుకొని ఆదంపతు లెన్ని వేడుకలో చేసుకొని ఆనందిస్తూ వచ్చారు.

భగవదనుగ్రహంవల్ల బాలయ్య ఏ కడగండ్లూ లేకుండా ఆరోజు కారోజు క్షేమంగానే పెరుగుతూ రోజులూ, నెలలూ, సంవత్సరాలూ గడచి

పెద్దవాడయినాడు. బాలయ్యకు తొమ్మిదోయేడు దాటి పదోయేడు రాంగానే మామూలు ప్రకారం ఆ సంవత్సరంకూడా తలిదండ్రులు బిడ్డకు పుట్టినరోజుపండుగ చేసుకోవాలని ఆశపడి, ఉదయాన్నే పిల్లవాడికి తలంటి నీళ్లుపోసి, కొత్తగుడ్డలు కట్టి, అవుసాలు పొంగించి, ఇంత పప్పూ పరమాన్నమూ చేసుకొని మినపవడలూ, నిప్పట్లూ కాల్చుకొని, కావలసిన బంధువులను నలుగురినీ భోజనానికి పిలుచుకొన్నారు. మరి ఆరోజున చేసుకొన్న పిండివంటలు తిన్నందువల్లనో, పిల్లవాడికారోజు నీళ్లుపోసి శృంగారించగా ఏ పాపిష్టికళ్లయినా పడి దృష్టిదోషం తగిలినందువల్లనో గాని పండుగ చేసుకొన్న సాయంత్రానికి బాలయ్యకు పొట్ట ఉబ్బరించి తెల్లగా కడుగులాగ నాలుగయిదు విరేచనాలయి, వొళ్ళు కొంచెం వెచ్చబడింది దానితో తండ్రికీ, తల్లికీ గుండె గుభిల్లుమనింది. దీనికి త వట్టుగా — ఆ గ్రామంలో ఎక్కడా అలికిడి కనబడలేదు కాని — ఆ చుట్టుపక్కల అయిదారుమైళ్ళదూరంలో అక్కడక్కడ ఒకటి రెండు గ్రామాలలో అమ్మవారి జాడ్యాలవల్ల బాగా ఉండనట్లు ఆనోటా ఆనోటా వెంకురెడ్డికీ, అతని భార్యకూ అదివరకే చెవికి వచ్చింది. ఆ పుకారు లేచింది లగాయతు అప్పటి కప్పుడే వారంరోజులుగా హంసాయి గ్రామాలవాండ్లను ఈ గ్రామానికి రాకుండా, ఈ గ్రామం వాండ్లను పొలిమేర దాటి పాయకారీ గ్రామాలకు పోకుండా వెంకురెడ్డీ వగైరా రైతులు గ్రామం నాలుగు గవిళ్ళలోనూ, పొలిమేరలలోనూ మనుష్యులను పెట్టి కాపుదారీ చేయిస్తూనే ఉన్నారు. కాని ఎన్ని కట్టుదిట్టాలు చేసినా ఆ రోజున బాలయ్యకు వెంటవెంటనే నాలుగుసార్లు కడుపు పళ్లేవరకు తలిదండ్రులకు ఖంగారుపుట్టి వెయ్యిదేవుళ్లకూ, దేవతలకూ మొక్కుకొన్నారు. పిల్లవాడికి ఏ ఆపదా లేకుండా తెల్లవారేవరకు సుఖవుగా లేచి తిరిగినట్టయితే అంకమ్మతల్లికి గావు సమయంలో కుంభం పోయించి మేకపిల్లను కోసుకొంటామని మొక్కుకొని పసుపుగుడ్డకు చిన్నడబ్బు మీదుకట్టుకొన్నారు. ఆ తలిదండ్రుల అదృష్టంకొద్దీ—భూమిమీద నూకలుండబట్టి—రాత్రి భోజనం లేకుండా పండుకొన్న బాలయ్య తెల్లవారి నిద్రలేచేవరకు కడుపుబ్బరం తీసి, విరేచనాలు కట్టి, అతనికి రెపరెపలాడుతూ

ఆకలి బయలుదేరింది అతను నిద్రమంచం మీదినుంచి లేవంగనే చీపురుకట్ట చమురులో ముంచి, నిప్పుపుల్ల ముట్టించి, ఆమంట బాలయ్యచుట్టూ మూడుసార్లు ఓగదుడుపుగా తిప్పి దిష్టి తీసివేసింది తల్లి. ఆ రోజు మొదలు పిల్లవాడు ఆరోగ్యం కలిగి మళ్ళీ సుఖంగా తిరుగుతూ ఆడుకొంటున్నాడు.

బాలయ్యకు జబ్బుచేసి నెమ్మదించిన మూడునెలలకే అంకమ్మజాతర సమీపించింది. ఆ రోజున ఉదయాన్నే బాలయ్యకు తలంటి నీళ్ళుపోసి కొత్తగుడ్డలు కట్టి అతన్ని శృంగారించారు. తలిదండ్రులు కూడా ఆరోజున తలకు స్నానంచేసి ఇంట్లో అమ్మవారికి చలిబిండి, పానకం నైవేద్యంచేసుకొని, ఉదయం పదీ, పదకొండుగంటలకల్లా పెందలాడే భోజనం చేసుకొని వాళ్ళకు తగినట్టుగా ఒక కుంకంబండి కట్టుకొని వెంకురెడ్డి, భార్యా, బాలయ్యా తిరునాళ్ళకు తయారవుతున్నారు.

"నాయనా! ఎక్కడికే మనం పోయేదీ?" అని బాలయ్య తండ్రి నడిగాడు.

"అంకమ్మతల్లి తిరునాళ్లకు తండ్రీ!" అన్నాడు వెంకురెడ్డి. వెంకురెడ్డి, భార్యా, బాలయ్య పుట్టిన తరువాత మొదటి రెండుమూడేళ్ళు అంకమ్మతిరునాళ్లకు వెళ్లారు కాని తరువాత తమ కుటుంబ వ్యవహారాలవల్లా, ఇతర కష్టాలవల్లా, పైగా వెంకురెడ్డికి వంట్లో బాగుండకా వాళ్ళు ఆరేడేళ్ళనుంచి ఏ తిరునాళ్ళకూ తీర్థాలకూ వెళ్ళడం మానేశారు. బాలయ్య కొంచెం జ్ఞానమెరిగిన తరువాత ఇదే వెళ్ళడం అంకమ్మ తిరునాళ్ళకు.

"అక్కడ ఏంచేస్తారు" అన్నాడు బాలయ్య.

"అబ్బో! ఎంతోమంది జనం వచ్చి వేడుకలు చేసుకొని అంకమ్మ తల్లికి మొక్కుబళ్ళు చెల్లించుకొని పోతారు నాయనా!"

"అంకమ్మ తల్లంటే ఎవరు?"

"ఏ జబ్బూ, ఏ ఆపదా రాకుండా మనలనందరినీ కాపాడే తల్లి. నీకు జబ్బుచేసినపుడు ఆయమ్మవారికి మొక్కుకున్నాం."

"నాయనా! నా మేకపిల్లను కూడా తెచ్చుకొంటానే" అని పిచ్చి బాలయ్య అమాయకంగా అడిగాడు.

“అట్లాగే వాయనా! మేకపిల్లను తీసుకుపోకుంటే ఎట్లా బాబూ! నీకు మొక్కుబడి చెల్లించుకోవద్దూ?” అన్నాడు వెంకురెడ్డి

బాలయ్యకు మేకపిల్లలంటే ఎంతో మక్కువ, అందులో ఆ మేకపిల్లంటే మరీ ప్రాణం. మొదటినుంచీ బాలయ్య మేకపిల్లతోపాటు సమానంగా పెరిగి వాటతోనే ఆడుకొంటూ వచ్చాడు. తండ్రి వెంకురెడ్డికి ఎప్పుడూ ఒకటో రెండో మేకలను పెంచే అలవాటు. ఎప్పుడూ అతనియింట్లో అధమం ఒక మేకపోతూ, ఒక ఆడమేకా ఉండేవి. ఆడమేక ప్రతియేటా ఒకటో రెండో పిల్లలను పెడుతూఉండేవి. ఆ పిల్లలు కాస్త పెద్దవి కావడంతోనే వెంకురెడ్డి వాటిని ఎవరికైనా అమ్మివేసి పెద్దమేకలనుమాత్రం ఇంట్లో పెట్టుకొనే మామూలు కద్దు. బాలయ్య కయిదారేళ్లు వచ్చినవి లగాయతు అతను ఈ రెండుమేకలతోనూ అస్తమానూ తిరిగి ఆడుకొంటూ ఉండేవాడు. ఆ మేకలు మేతకోసం బయటికిపోయినప్పుడు తప్ప అవి తిరిగి ఇంటికి చేరినది లగాయతు అతను వాటిని క్షణం విడిచి పెట్టకుండా ఉండేవాడు. బాలయ్య ఏడోయేట ఆడమేక రెండుపిల్లలను ఈనింది. అందులో ఒకటి మొగదీ, రెండోది ఆడదీని. ఆపిల్లలు కాస్త పెద్దవై తల్లిపాలు విడిచి మేత మేసే యీడు వచ్చేవరకు వాటితల్లి అప్పటికే ఏడెనిమిది ఈతలు ఈని ముసలిదయినందువల్ల వెంకురెడ్డి దాన్ని, దానితోపాటు మేకపోతునూ— రెండిటినీకూడా ఒక తురక సాహెబుకు రెండువరాల మాడాచవలానికి అమ్మివేసి, వాటిపిల్లలను రెంటినీ మట్టుకు తాను నిలుపుకొన్నాడు. ఈ రెండుపిల్లలూ ఇంట్లో బాలయ్యకు తోడుగా ముద్దుగా పెరుగుతూ పెద్దవుతూ ఉన్నందువల్ల వెంకురెడ్డి మళ్లా పెద్దమేకలను కొని తీసుకురాలేదు. కాని, తల్లిమేక నమ్మివేసిన రెండు నెలలకు వాయుగుణం కనిపించి, ఈ రెండుపిల్లలలోనూ ఆడపిల్ల నాలుగోనాటికి హఠాత్తుగా నాలుక బయటవేసి చచ్చిపోయింది. అదిలగాయతు మొగపిల్ల ఒక్కటే బాలయ్య దగ్గర బాగా మాలిమయింది. బాలయ్య ఆ వొక్క మేకపిల్లనూ తన ప్రాణంతో సమానంగా పెంచుకొంటున్నాడు. దాని తల్లి ఉండేటప్పుడు ఆ పిల్లతోపాటు తానుకూడా తల్లిమేకపొదుగులో తలదూర్చి, రెండో సన్ను నోట్లో పెట్టుకొని చప్పరిస్తూ, పాలుచేపిన తరువాత పీల్చి తాగుతూ మేకపిల్లతో సమానంగా

తానుకూడా కడుపునింపుకొని ఆకలి తీర్చుకొంటూ ఉండేవాడు. బాలయ్యకు ఎనిమిదోయేడు వచ్చింది లగాయతు మొలకు గోణం కట్టుకొని ఆ మేకపిల్లను తానే స్వయంగా పొలం తోలుకొనిపోయి తల్లి తండ్రీ పొలంలో ఏ కలుపో తీసుకొంటూవుంటే అతను మేకపిల్ల మెడకు పొడుగాటి తాడు కట్టి పట్టుకొని చెరువుగట్టుమీది పొదలలో చెడిబుడీ ఆకు మేపుతూ ఉండేవాడు. పొద్దుగూకులా ఆ మేకను మేపినంతసేపూ మేపి సాయంత్రం దానికి చెరువులో నీళ్ల తాపించి, రాత్రి ఇంటికాడ మళ్ళీ తినడానికై ఏ జువ్విమండలో, ఏ రాగిమండలో నాలుగు—లేతవిగా చూచి—తండ్రిచేతనే కోయించి, వాటిని మోయనుగా ఒక చిన్నకట్ట కట్టించి, తానే నెత్తిన పెట్టుకొని మేకను తోలుకొంటూ ఇంటికి తెస్తూ ఉండేవాడు. రాత్రిళ్ళకూడా బాలయ్య మేకను తాను పండుకొనే మంచాని కానించి గుంజకు కట్టి, తాను అన్నం తిని పండుకోబోయే సమయంలో, సాయంత్రం తెచ్చిన మండలు దానిముందు వేసి మరీ పండుకొనేవాడు.

మేకపిల్లకు కూడా బాలయ్య దగ్గర బాగా మాలిమయి, అతను ఒక్క గడియ అగుపడకుండా వుంటే దిగులుపడి మేతా నీళ్లూ ముట్టకుండా చెవులు నిక్కబెట్టి, నలుదిక్కులా పారజూస్తూ మే, మే, మే అని అరస్తూ వుండేది. బాలయ్యవద్ద అలవాటయినప్పటి నుంచీ తనతల్లిదూరమైన దిగులు ఆ మేకపిల్ల మరచిపోయింది. ఒక్కొక్కప్పుడు ఆ మేకపిల్ల నిద్రపోతూవున్న బాలయ్య పక్కలోకి పోయి ఆ మంచంమీదనే తాను కూడా కాళ్ళు ముడుచుకొని పండుకొని, నెమరువేస్తూ, అప్పుడప్పుడు తన తల బాలయ్య ఒడిలో పెట్టుకొని నిద్రపోయేది. మెళకువ వచ్చినపుడు బాలయ్య ఆ పిల్లను దగ్గరగా తీసుకొని చేత్తో దువ్వి ముద్దు పెట్టుకొని చలివేయకుండా తాను కప్పుకొన్న దుప్పటి సగం దానికి కప్పి, మీద చెయ్యివేసి పండుకొనేవాడు. ఈ విధంగా బాలయ్య, మేకపిల్లా పశు నరజన్మల భేదం పాటించకుండా ఏకగర్భవాసాన్న పుట్టిన బిడ్డలవలె పెరుగుతూ ఒకరి నొకరు అన్యోన్యమూ ప్రేమించుకొంటూ జీవిస్తూ వున్నరోజులవి. బాలయ్యకు పదోయేడు ప్రవేశించి నప్పటికి మేకపిల్లకు మూడోయేడు ప్రవేశించింది. బాలయ్య మేకపిల్లకు మస్తీలు చేశాడు.

అంకమ్మతల్లి జాతరకు వెంకురెడ్డి, భార్యా, బాలయ్యానూ అతని మేక పిల్లనూ తీసికొని బండెక్కినారు. తండ్రి చెప్పిన మాటలు బాలయ్యకు అర్థం కాలేదు: తానూ తన మేకపిల్లా తిరునాళ్ళకు వెడుతున్నామన్న సంబరంలో అతను వాటిని గూర్చి యింక ఆలోచన కూడా చేయలేదు. బండెక్కి కూర్చుని బాలయ్య మేకపోతును దగ్గరకు తీసుకొన్నాడు. మేకపోతు బాలయ్య ఒడిలో తలపెట్టుకొని నెమరవేస్తూ పండుకొన్నది. బాలయ్య పుట్టిన గ్రామానికీ, అంకమ్మజాతర జరిగే గ్రామానికీ సుమారు పదిమైళ్ళ దూరంపైగా ఉంటుంది. దారి పొడుగునా వెంకురెడ్డీ, భార్యా, అంకమ్మతల్లికి దణ్ణాలు పెట్టుకొంటూ మధ్యాహ్నం మూడు నాలుగుగంటలకు అంకమ్మ దేవళంవద్దకు చేరుకొన్నారు. బండిని ఎడంగా వేపచెట్టుకింద విప్పి వెంకురెడ్డీ, భార్యా, బాలయ్యా తిరునాళ్ల చూడడానికి బయలుదేరారు. బాలయ్య మేకపిల్లను విడిచిపెట్టకుండా దాని తాడు చేత్తో పట్టుకొని కూడా తిప్పుకొంటున్నాడు.

## 4

మంచి మండువేసవి. పడమటి గాడ్పు చేటలతో నిప్పులు చెరుగుతున్నది. జనానికి నాలుక తడారిపోతున్నది. ఎన్నినీళ్ళు తాగినా పొట్ట ఉబ్బడమేకాని దాహశాంతి కావడంలేదు. జనం కిటకిటలాడుతూ ఉన్నారు. దేవళందగ్గరి తిరునాళ్ళ ఘోష బయట మైలుదూరంలో గలవారికి కూడా వినపడుతున్నది. బాలయ్య అదివరకెన్నడూ అమ్మవారి జాతర చూచినవాడూ కాడు: విన్నవాడూ కాడు. అంతా మహావింతగా ఉన్న దతనికి. అంతమంది జనం ఒక్కచోట చేరగా తానెన్నడూ చూడలేదు. మిఠాయి అంగడికి తీసుకొనివెళ్లి తండ్రి ఒక యేబులం మిఠాయికొమ్ములూ, జీడిపప్పు కొని బాలయ్య చేతిలో పెట్టాడు. నాలుగు కొమ్ములు తాను తిని నాలుగు మేకపిల్ల నోటికందిచ్చాడు బాలయ్య. కాని ఆ జనసమ్మర్దంలో మేకపిల్ల పసికట్టిందో యేమో, దానికి గుండెలు అదుర్దాగా ఉండి, నోటి కేమీ హితవు కానందున కాబోలు, బాలయ్య అందిచ్చిన కొమ్ములు అది అందుకోకుండా, నెమరు అయినా వేయడంచాలించి, అతనితో కూడా తిరుగుతున్నది.

సాయంత్రం అయిదు గంటలు కాగానే అమ్మవారి దేవళం దగ్గర, జనం తోసుకొంటున్నారు. దేవళం వద్దకు పోవడానికి వీల్లేకుండా ఉన్నది. గావుసమయం సమీపించింది అయిదూ అయిదున్నరగంటల లగాయతు మొక్కుబళ్లు చెల్లబడికావాలె. గావు అంటే ఏమిటో, ఎట్లా ఉంటుందో కళ్లారా చూడడానికై తహశీల్దారుగారు, మేజస్ట్రేటుగారు, పోలీసుసర్కిల్ ఇనస్పెక్టరుగారు దేవళంవాకిట విడిగా ఒకప్రక్క తలా ఒక కుర్చీ వేయించుకొని కూర్చున్నారు. సబినస్పెక్టర్లూ, పోలీసు జవానులూ జనాన్ని ఆ తట్టుకూ, ఈ తట్టుకూ లాఠీకర్రలతో నెట్టి మొక్కుబడి చెల్లించవలసినవాండ్లు దేవళం కాడికి రావడానికి దారితీస్తున్నారు. అక్కడ ఏమి జరుగుతోందో బాగా కనపడాలని, జనం ఒకరి భుజాలమీద మరొకరు తలలు పెట్టి పాదాలు ఎత్తి బొటనవేళ్ళమీద నిలబడి, ముఖం అంతా కళ్ళుచేసుకొని చూస్తున్నారు. చిన్నపిల్లల్ని కొంతమంది భుజాలమీద కూర్చోబెట్టుకొని, దేవళం వాకిటజరిగే వైభవాన్ని చూపుతున్నారు. ఈ త్రొక్కిసలాటలో మోచేతిపోటులకు, మోకాలి త్రోపులకు అవస్థ పడలేక కొంతమంది సమీపంలో గల చింతచెట్లూ, వేపచెట్లూ ఎక్కి, కొమ్మల సందున కూర్చుని చూస్తున్నారు. దేవళానికి ఉత్తరపుతట్టు సుడిమాను తిరుగుతున్నది. దేవళం చుట్టూ కుంకంబళ్ళు తిరగడానికి కట్టబడిన దారిలో బళ్ళు తిరుగుతున్నవి. అమ్మవారి గరగలు దేవళంలో అలంకరింపబడి శోభిల్లుతూ ఉన్నవి. గణాచారులలో ఒకడు, మూతిమీద మీసాన్నయినా తీయించకుండా చీర కట్టుకొని, రవికె తొడుక్కొని, ఆడవేషం వేసుకొని, ఒంటికీ, ముఖానికీ పసుపూ కుంకుమా అలముకొని, చేత వేపమండలు పట్టుకొని దేవళం గడపలో, ఎడంకాలు కిందికి ముడిచి, కుడికాలు పైకి వంచి, మోకాలిపై చేయి పెట్టుకొని కూర్చున్నాడు. ఇతడే అమ్మవారి అపరావతారం. ఇతడారోజున ఎవరితోనూ మాట్లాడడు. మౌన ముద్రవహించి ఉంటాడు. మనిషి మన స్మారకంలోనే ఉండడని అంటారు కొందరు. అప్పుడప్పుడు చిరునవ్వు మాత్రం నవ్వుతూ ఉంటాడు. మరొకగణాచారి చేత్తో పురదాడు పట్టుకొని ఒళ్ళుతెలియకుండా గంతులు వేస్తున్నాడు. ఇతనికి కూడా ఆ రోజు స్మారకం ఉండదనే ప్రతీతి. దేవళం వాకిటకు దక్షిణపుతట్టు డప్పులు వగైరాల

మేళం చెవులు చిల్లులు పడేటట్టు ఎవరిమాట వారికే వినపడకుండా ధ్వనిచేస్తున్నది. గణాచారి ప్రక్కన కుండిలో సాంబ్రాణి పొగ పొరలు పొరలుగా, తెరలు తెరలుగా పైకిలేచి మేఘంలా వ్యాపిస్తూ ఉన్నది. దాన్ని ఆఘ్రాణించేవరకు గణాచార్లకే కాకుండా, చూపరులకు కూడా ఒక విధమైన ఆవేశం కలుగుతున్నది. మొక్కు బళ్లవారు తలా ఒక మేకపోతునో, పొట్టేలునో, కోడినో తెచ్చి, దగ్గరపెట్టుకొని నిలబడియున్నారు. వారివెంట వచ్చిన ఆ సన్న జీవాలు చేసే ఆక్రందన ధ్వని సముద్రంలో పడ్డ వానచినుకు లాగ, ఎవరికీ వినపడకుండా ఆ రొదలో లీనమైపోతున్నది. వెంకటెత్తి, భార్యా, బాలయ్యా కూడా దేవళంకాడికి వచ్చి ఒక తట్టుగా ఒదిగి నిలబడి యున్నారు.

ఇంతలో ఒక పూజగొల్లవాడు ఒక నిండుకల్లు కుండ భుజాన పెట్టుకొని, దేవళం గడపలో కూర్చున్న ఆడ వేషధారి అయిన గణాచారిని సమీపించి, కుండలో కల్లు తాను నోట్లో పోసుకొని, పుక్కిలించి, ఒక్కొక్క పుక్కిలే గణాచారి మొఖాన్న తుపుక్కున ఉమ్మి వేస్తున్నాడు. ఆ ప్రకారం కుండలో కల్లు యావత్తూ పూర్తి అయ్యేదాకా అతడు పుక్కిలించి, గణాచారిని నఖశిఖ పర్యంతమూ స్నానం చేయించాడు. గణాచారి చిరునవ్వు నవ్వుతూనే ఉన్నది. ఇంతలో మరిద్దరు మనుష్యులు వచ్చి గణాచారిని నోటపట్టరాని బండబూతులు, తిట్టినబూతు తిట్టకుండా, గుక్క తిరగకుండా ఒకరి తర్వాత మరొకరు చొప్పున ఒక పావుగంటసేపు బూతులదండకం చదివి ప్రక్కకు ఒదిగారు. గణాచారి ప్రసన్న సూచకంగా చిరునవ్వు నవ్వింది. ఈ ప్రకారం తిట్టితే అమ్మవారికి బ్రహ్మానందమట! ఆ తరువాత ఒక ఆనాదివాడు నోట్లో పెదకొమ్ము పెట్టుకొని, గణాచారి ముఖం దగ్గర పెట్టి ఊది వికృతశబ్దం చేశాడు. ఆ తరువాత మరిద్దరు మనుష్యులు ఒక మేకపిల్లను తెచ్చి, ముందు కాళ్లు రెండూ ఒకడున్నూ, వెనకకాళ్లు రెండూ మరొకడున్నూ పట్టుకొని, మేక కడుపు అడుగు భాగం పైకి వచ్చేటట్టు వెల్లకిలా త్రిప్పి, ఎత్తిపట్టుకొని నిలబడ్డారు. మరొకరు వచ్చి మేకనోరూ, ముక్కు రంధ్రాలూ చేతులతో గట్టిగా

మూసి పట్టుకొన్నాడు. మళ్లా మేక మీద ఒకడు పెడకొమ్ము పెట్టి ఊదాడు. అప్పటికప్పుడే మేకపిల్ల కడుపు వీరణంలాగ ఉబ్బి పొట్ట పైకిలేచింది. దేవళం వాకిట గణాచార్లు సివం ఎత్తి శరీరం తెలియకుండా చిందులు తొక్కుతూ వెర్రికేకలు వేస్తున్నారు. వారిలో ఇద్దరు గణాచారులు మేకకు ఇరుప్రక్కలా చెరొకరూ నిలబడి, చేతిలో ఉండిన వుసదాడుతో (అనగా మొదట లావుగా ఉండి చివరకు పొయ్యేవరకు సన్నగిల్లే బారెడు పొడుగు తాడు) వరుస వరుసగా. ఒకరి తర్వాత మరొకరు చొప్పున మేకపిల్ల కడుపు మీద పెటీ, పెటీ మని ఇరవై దెబ్బలు కొట్టారు. వాకిట గణాచారి చిరునవ్వు నవ్వింది. ఇంత కంటె నన్ను మీరేం చేయగలరు-ఇంతేనా అన్నట్టుగా, ఎన్ని దెబ్బలు కొట్టినా మేకపిల్ల కిక్కురు మనకుండా నోరుమూసుకొని ఊరుకొంది. అంతట గణాచార్లలో ఒకడు ఆ మేకపిల్లను చేతులతో ఎత్తుకొని తన మూతివద్ద మేకపిల్లమూతి పెట్టుకొని దాని అడుగు దవడ, పై దవడ చివరఉండే చర్మాన్ని తన ముని పళ్లతో ముక్కలు ముక్కలుగా కొరికి మాంసపు కండలను కింద ఉమ్మివేస్తూ గంతులువేస్తున్నాడు. అప్పటికి జనంలో విపరీతావేశమూ. ఆహాహాకారాలూ జాస్తి అయినవి. గణాచారి చిరునవ్వు నవ్వుతూనే ఉన్నది. ఈ వినోదాన్నంతా చూస్తూ సర్కారు అధికార్లు ఆనందిస్తున్నారు.

బాలయ్య కిదేమీ అర్థం కావడం లేదు. అతనికి గుండెలు రైలు ఇంజనులాగ దడదడ కొట్టుకొంటున్నవి. అతని తల్లిదండ్రులు అమ్మవారికి చేతులెత్తి మొక్కుకొంటున్నారు చేతులో పట్టుకొన్న మేకపిల్ల మే, మే అని తెగ అరుస్తున్నది. బాలయ్యకు మేకపిల్ల మీద వెర్రి మమకారంబయలుదేరింది. దాన్ని తన ప్రక్కకు దగ్గరగా లాక్కొని చేత్తో దువ్వుతున్నాడు.

ఇంతలో మొక్కుబళ్లు అని కేక వినబడింది. ఒక్కొక్కరే ముందుకు సాగారు. వేటలకు ముఖాన్న పసుపూ, కుంకమా పూసి, మెడలో వేపాకుకట్టి, ముందుకు తీసుకొని వస్తున్నారు. ఒక గణాచారి అర్ధమణుగు బరువుగల ఒక ఆయుధాన్ని భుజంమీద పెట్టుకొని నిలబడియున్నాడు. ఒక్కొక్కరే వేటపోతును గణాచారి సమక్షంలోనికి తీసుకొనిపోయి, ముందుకు వంగి దణ్ణాలు పెట్టుతున్నారు. గణాచారి చిరునవ్వు నవ్వుతూనే ఉన్నది. ఆయుధపాణి అయిన మనిషి పూర్తిగా కైపెక్కి ఉన్నాడు.

ఆతని గ్రుడ్లు ఎర్రగా చింతనిప్పులలాగా కణకణలాడుతున్నవి. ఆ ప్రదేశం అంతా కల్లుకంపుతో ముక్కబద్దలై పోతున్నది. పైన ఆకాశంమీద గద్దలు గుంపులు గుంపులుగా వలయాలు చుట్టుతున్నవి. కొన్ని రాబందులు సమీపంలోఉన్న తాటిచెట్లమీద కూర్చున్నవి. ఆయుధపాణి ఒక్కొక్క వేటనే మెడమీద ఆయుధంతో ఒక్కపెట్టుపెట్టి, త్రుటికాలంతో దాని, మొండెము తలకూ సంబంధం విడదీస్తున్నాడు. క్రిందపడిన తలలూ, మొండెములూ ఒకటి రెండు నిముషాలు గిలగిలకొట్టుకొంటూ వరవళ్లై ప్రవహించే రక్తాన్ని నలువైపులా చిమ్ముతూ కొంతసేపటికి చలనం తగ్గి ఊరుకొంటున్నవి. ఇట్లా ఒకచోట కాదు, రెండుచోట్ల కాదు; నాలుగైదుచోట్ల వేటలు జరుగుతున్నవి; సన్నజీవాలు లెక్కలేకుండా తెగిపో తున్నవి. చిందిన నెత్తురు చుక్కలు చుట్టూ నిలబడి వున్న జనం గుడ్డలమీదకూ, మొఖాలమీదకూ చిందుతున్నవి. పొద్దుకూకి సంజచీకటి పడేవరకు వేటలు వందలు వందలుగా తెగిపోతున్నవి. తెగిన తలకాయలు మాత్రం— మేక తలకాయలుఒక గుట్టగానూ, గొర్రె తలకాయలుఒక గుట్టగానూ, కోడితలలుఒకగుట్టగానూ,— గొల్లవాళ్లొకచోట విడివిడిగా పోగులుపెట్టుతున్నారు. కళేబరాలనుమాత్రం స్వంతదార్లు తీసుకొనిపోతున్నారు. నెత్తురుతో తడిసిన కాలిక్రింది మట్టి ఎర్రగా అడుసు కట్టి బురదబురదగా కాలువేస్తే జర్రున జారుతున్నది. ఆయుధధారి అయిన గణాచారి కత్తి మార్చి మరొక కత్తి తీసుకొన్నాడు. పాతకత్తిని మరొకడు రక్తంతుడిచి రాతిమీద పదును పెడుతున్నాడు. అంతా మహా కోలాహలంగా ఉంది; జనసమ్మర్దం ఎక్కువైనది.

ఇంతలో వెంకురెడ్డి, భార్యా ముందుకు రెండడుగులు వేశారు. బాలయ్య మేకను దగ్గరగా తీసుకొని వెనుకకు నాలుగడుగులు వేశాడు. తన కళ్ల ఎదుట లెక్కలేని సన్నజీవాలు తెగిపోతున్నవి. సృష్టికర్తచే సృజింపబడ్డ నోరులేని ఆ సన్న జీవాల తలకాయలను కనురెప్పపాటులో శరీరంనుండి వేరుచేయగలవారేగాని విడిపోయిన తల నొక్కదానిని కూడా తిరిగి అతికించగల మొనగాడు అతని కళ్ళకొక్కడు కూడా కనిపించడం లేదు. బాలయ్యకు గాబరా పుట్టింది, శరీరం చిరుచెమ్మట పోసింది. కాళ్ళు

భూమిమీద నిలవడం లేదు. త్రోపు ఎక్కువయినది; నలిగిపోతున్నాడు. అతనికి కళ్ళు చీకట్లు కమ్ముతున్నవి. ఆ త్రొక్కిడిలో గాలి సరిగా రాక అతనికి ఊపిరాడడంలేదు. దాహం పీకె ఆర్చుకొనిపోతున్నది. గుండె దడ దడమని కొట్టుకొంటున్నది. తన మేకపిల్ల ఏమవుతుందో అని అతనికి భయంవేసింది. తనపిల్లకు కూడా మొఖాన్న పసుపూ, మెడలో వేపమండలూ ఉన్నవి. ఇంత విపరీతమైన జీవహింస చూసేసరికి ఆ బాలుడికి ఒళ్ళు కంపర మెత్తిపోయింది. ఎందుకు నరుకుతున్నారో అతనికి అర్థం కావడంలేదు. ఇటువంటి చోటికి తనతల్లిదండ్రులు తీసుకొని వస్తారని అతనికి తెలియదు. మేకపిల్ల తన ప్రక్కన వున్నదో లేదో అని అతడు పదేపదే చూసు కొంటున్నాడు.

"అబ్బాయీ! రా" అని ముందుకు జరిగిన తండ్రి పిలిచాడు. బాలయ్య కదలలేదు. తండ్రి వెనక్కివచ్చి మేకపిల్లను బాలయ్య చేతిలో నుండి లాకొన్నాడు. బాలయ్య కెవ్వుమని కేకవేసి ఏడుపు ఆరంభించాడు.

"నాయనా! తప్పు! ఏడవకూడదు. అదుగో చూడు! అంకమ్మతల్లి. భయపడకు. దణ్ణంపెట్టుకో" అని తల్లిదండ్రులు గణాచారిని చూపించారు. "నా మేకపిల్లని నా కిచ్చివేయవే నాయనా! నేను రానే" అని బాలయ్య ఏడుస్తున్నాడు. "అట్లా అనకూడదు తండ్రీ! నీకు జబ్బు చేసినపుడు మేకపోతు నిస్తామని మొక్కుకొన్నాం. దీన్ని అమ్మవారి కిచ్చివేయి. నీ కింకొకటి మంచిది కొనిపెడతాలే" అని తండ్రి బుజ్జగిస్తున్నాడు. ఇంతలో "పిల్లవాణ్ణి ఎందుకు తీసుకువచ్చావయ్యా! వెనక్కి తీయవయ్యా" అని గణాచార్లు అరుస్తున్నారు. బాలయ్య మేక తెగ అరుస్తూ నిలబడి ఉన్నది. వెంకురెడ్డి మేకపిల్లను గణాచారిచేతి కందించాడు; బాలయ్య గొల్లున గోలపెడుతూ ముందుకు దూకుతున్నాడు. తల్లి వెనక్కు తీస్తోందతన్ని,

ఒక గణాచారి మేకపిల్లను గుమ్మంలో కూర్చున్న ఆడవేషధారి అయిన గణాచారివద్దకు తీసుకొనివెళ్లాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. సంజచీకటి-సాంబ్రాణిధూపం పొగలు. అంకా మసక మసకగా ఉంది. జనసమ్మర్దం జాస్తి అయినది. పక్కజనంలో వేటభాగాలకోసం చాకళ్ళలో చాకళ్ళకు తగవులుపడ్డవి. తప్పతాగి ఉన్నారేమో వాళ్లు అది పెద్దదెబ్బలాటయి

గలభా ముదిరింది తోపు ఎక్కువయింది. జనం కనిస్టీబులనుకూడా తోసుకొని అధికారుల మీద పడుతున్నారు. అక్కడ కూర్చుండడం వారికే కష్టమయింది. బయటకు వెడదామంటే దారీతెన్నూ కనబడడం లేదు; లేచి నుంచున్నారు. అంతా ఒకటే తోపుడు. ఇంత సమ్మర్దంలోను ఇంతతోపులోను బాలయ్యకు కనబడుతున్నదల్లా అతని మేకపిల్లే. దానిమీదే ఉంది అతనిదృష్టి. మేకపిల్లకూ అంతే. మేకపిల్ల బాలయ్యవైపు తిరిగి కన్నీరు కారుస్తూ ఒకటే అరుస్తోంది. బాలయ్యకు హృదయం ద్రవించి పోతోంది. అతని మనస్సు మనస్సులోలేదు. కేకలు హెచ్చుతున్నవి. ఎవరి సందడిలో వారున్నారు. ఇంత రొదలోనూ ఏకాగ్రచిత్తంతో "అంకమ్మతల్లీ! నీ దయ చల్లంగా ఉండాలమ్మా" అని బాలయ్య తల్లిదండ్రులు అమ్మవారికి చేతులెత్తి మొక్కు-కొంటున్నారు. ఆయుధపాణి మేకపిల్ల మెడకు కత్తి గురిచేసి పైకెత్తాడు. బాలయ్యకు ఒళ్ళు తెలియలేదు. "చచ్చిపోతోంది బాబోయి నా మేకపిల్ల" అంటూ ముందుకు దూకినాడు. ఆ గలభా జనం త్రోపుడులో ఎట్లా జరిగిందో మరి, మేకపిల్లమీద వచ్చిపడ్డాడు బాలయ్య. ఆ తోపుకి మేక జరిగింది. పైకెత్తిన గణాచారికత్తి బాలయ్య ప్రాణాలు తీసింది. అతని తలా, మొండెమూ నేలమీదపడి గిలగిల కొట్టుకొంటున్నవి. మే, మే అని అరుస్తూ మేకపిల్ల బాలయ్యచుట్టూ తిరుగుతున్నది. బాలయ్యకళ్ళు మేకను చూసుకొని నవ్వి మూసుకుపోయినవి.

అంతా నిశ్శబ్దమయిపోయింది క్షణకాలం. బాలయ్య తలిదండ్రుల యేడుపే వినబడ్డది అప్పుడు. "బాలయ్యో! బాబో!" అంటూ నేలమీద కుప్ప గూలిపోయారు వారు. "ఖూనీ, ఖూనీ, పకడ్‌లే" వంటూ అదివరకే లేచి నుంచున్న పోలీసు సర్కిల్ ఇనస్పెక్టరు ముందుకు తోసుకవచ్చాడు. ఆయుధపాణి నిద్దరు పోలీసు జవానులు అరెస్టు చేసేవరకు అతని నిషం తగ్గి ఒంటిమీద స్మారకం కలిగింది గుమ్మంలో కూర్చున్న గణాచారికి ఈ సారిమాత్రం ముఖంమీద చిరునవ్వు లేదు; తెల్లమొఖం వేసింది. కూర్చున్న మనిషి లేచి నిలబడ్డాడు.